## క్లుప్తంగా

### ఏఈ ఆకస్మిక బదిలీ



ఏఈ హరిబాబును సత్కరిస్తున్న ఉద్యోగులు

**అమలాపురం రూరల్:** ఏపీఈపీడీసీఎల్ అమలాపురం రూరల్ ఏఈ అప్పారి హరిబాబుపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఆకస్మికంగా బదిలీ చేశారు. దీంతో ఆయన శుక్రవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. రిలీవ్ అయిన ఏఈ హరిబాబును శనివారం కామనగరువు విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఉద్యోగులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఏ సమయంలోనైనా ప్రజలకు అందుబాటులో ఉండే హరిబాబును బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచాలంటూ స్థానికులు కోరుతున్నారు.

### లోక్ అదాలత్‌లో 15 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సొమ్ములు చెల్లిస్తున్న సిబ్బంది

**యానాం:** యానాం తాలూకా లీగల్ సెల్ సరీ్వస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కేసులు పరిష్కరించినట్లు జడ్జి కె.రాజామోహన్ తెలిపారు. ఈ సందర్భంగా 15 సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ తదితర కేసులను విచారించి రూ.10.61 లక్షల మేర ఆయా కక్షిదారులకు సొమ్ములను చెల్లించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది శ్రీనివాస్, న్యాయవాదులు ఎస్ఎస్ఎన్‌రాజు, కమిడి విజయకుమార్, పేర్ని ఆదినారాయణమూర్తి, ఎస్ఎంటీ బాషా, గెద్దం భ్రమరాంబిక, నారాయణ, సూపరింటెండెంట్ జయప్రకాష్, క్లర్క్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరం విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరమ్మ

**అమలాపురం రూరల్:** మండలంలోని సవరప్పాలెం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు గ్రామ సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ సత్తి ఆదిలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్తి శ్రీరంగయ్య, గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సీఎం రంగసామి రాజీనామా చేయాలి

**యానాం:** పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి పోటీలో దిగిన బీజేపీ అభ్యర్థి, హోంమంత్రి నమశ్శివాయం ఓటమి చెందిన నేపథ్యంలో దానికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రంగసామి రాజీనామా చేయాలని మాజీ ముఖ్యమంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత నారాయణసామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం అఖండ విజయం సాధించడం సీఎంకు, మంత్రులకు పెద్ద ఎదురుదెబ్బ అన్నారు. పుదుచ్చేరి ఎంపీ స్థానంలో ఉన్న మొత్తం 30 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 28 నియోజకవర్గాల్లో వైథిలింగం పూర్తి మెజారిటీ సాధించారన్నారు. ప్రధానంగా సీఎం, మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఆయనకు అత్యధిక ఓట్లు లభించాయన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



అంకతోట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

**అమలాపురం రూరల్:** మండలంలోని పేరూరు గ్రామంలో లంకతోట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే, ఫేర్‌వెల్ డే ను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ విజయకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడమే కాకుండా బాల్య దశలోనే విద్యాబుద్ధులు నేర్పి పాఠశాలలకు పంపిస్తున్నామన్నారు.

# వైభవంగా సుదర్శన హోమం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చక స్వామి



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వర స్వామివారు



పి.మల్లవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**అమలాపురం టౌన్:** స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతి పాత్రమైన రోజు కావడంతో దర్శనానికి బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, వేద పండితులు పాణింగపల్లి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షనలో స్వామికి విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉదయం ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. ఆలయం ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి సైతం భక్తులతో కిటకిటలాడింది. సాయం సంధ్య వేళ స్వామి వారి ఉయ్యాల సేవ జరిపారు.

**కళకళలాడిన వెంకన్న కోనేరు**

**అమలాపురం టౌన్:** అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల కోనేరు శనివారం రాత్రి విద్యుత్ కాంతులతో కళకళలాడింది. ఆలయ గాలి గోపురం, త్రిముఖ ఆంజనేయ భారీ విగ్రహం, ప్రధాన ఆలయాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. కోనేరులో మధ్యలో కొలువై ఉన్న శయన పాన్పుపై విష్ణుమూర్తి విగ్రహం, కోనేరులో ఫౌంటెయిన్లతో సుందర దృశ్యాలను చూసి ఆలయానికి వచ్చిన భక్తులు సేద తీరారు.

**ఘనంగా నక్షత్ర పూజలు**

**ఉప్పలగుప్తం:** మండలంలోని భీమనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న అనంగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ఈఓ కె.కార్తీక, వరదా శ్రీరామచంద్రమూర్తి సమక్షంలో ఆరుద్ర నక్షత్ర పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు వెలువలపల్లి సత్యనారాయణ శర్మ మహాశివునికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు**

**తాళ్లరేవు:** మండలంలోని పి.మల్లవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆంజనేయస్వామికి శనివారం పునఃపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమజ్జయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహ దాత రవీంద్ర స్వామివారికి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి బాబి, ఉంగరాల కృష్ణ, రామకృష్ణ, శుభ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..



కామనగరువు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**అమలాపురం రూరల్:** మండలంలోని కామనగరువు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–2001 మధ్యకాలంలో చదువుకున్న విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 23 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

## తాళ్లరేవు సొసైటీ అధ్యక్షుడు జనార్ధనరావు రాజీనామా



దున్నా జనార్ధనరావును సత్కరిస్తున్న సొసైటీ సిబ్బంది, రైతులు

**తాళ్లరేవు:** మండల కేంద్రమైన తాళ్లరేవు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దున్నా జనార్ధనరావు తన పదవికి రాజీనామా చేశారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి పాలవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2013లో తనను సొసైటీ అధ్యక్షునిగా రైతులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అనంతరం వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం త్రీమెన్ కమిటీలో తనకే అవకాశం ఇచ్చిందన్నారు. తాను బాధ్యత తీసుకునే సమయానికి రూ.3.5 కోట్లుగా ఉన్న సొసైటీ టర్నోవర్‌ను ప్రస్తుతం రూ.12 కోట్లకు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు రూ.60 లక్షల వ్యయంతో సొసైటీకి ప్రత్యేక భవనాన్ని నిర్మించి ఆదాయం వచ్చేలా చేశామన్నారు. సీ గ్రేడుగా ఉన్న సొసైటీని ఏ గ్రేడు సొసైటీగా మార్పు చేశామన్నారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ ధూళిపూడి మోహన్, సిబ్బంది జనార్ధనరావును దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు పెన్మెత్స చంటిరాజు, కట్టా మార్కండేయులు, సిబ్బంది కూర్మదాసుల సంపత్, నేతల రాజశేఖర్, అటెండర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ విత్తనాలు సిద్ధం



గూడాల రైతు భరోసా కేంద్రంలో సిద్ధం చేసిన వరి విత్తనాలు

**అల్లవరం:** మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ పంటకు అనువైన వరి విత్తనాలను సిద్ధం చేశామని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1064 రకాలతో పాటు నూతన వరి వంగడం ఎంటీయూ 1318 రకాలను అందుబాటులో ఉంచామన్నారు. ఎంటీయూ 1318 వరి వంగడం పంట కాలం 160 రోజులు కనుక ముందస్తుగా నారు వేసే రైతులకు ఈ రకం అణువుగా ఉంటుందన్నారు. ఎంటీయూ 1064, ఎంటీయూ 1318 రకాలు బలమైన గాలులు, భారీ వర్షాలకు సైతం తట్టుకుని నిలబడతాయన్నారు. ఈ ఏడాది 3 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగయ్యే అవకాశం ఉందని, అందుకు అవసరమైన 100 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు. రైతులకు ప్రతి 30 కేజీల బస్తాపై రూ.150 సబ్సిడీగా అందిస్తున్నామని, మిగిలిన మొత్తం రైతులు చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏఓ సూచించారు. అలాగే రైతులు ముందస్తు ఖరీఫ్‌కు సమాయత్తం కావాలని, ఆలస్యం చేయకుండా నారుమళ్లు సిద్ధం చేసుకుని త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలన్నారు. ముందస్తు ఖరీఫ్‌తో ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు.

## లార్వా అరికడితేనే మలేరియా నిర్మూలన సాధ్యం



మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వీరవల్లిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

**అయినవిల్లి:** చెత్తకుప్పలు, చెత్తకుండీలు, మురుగునీటి కాలువల్లో దోమ లార్వా వృద్ధి చెందుతుందని అ ప్రదేశాల్లో ఉన్న దోమ లార్వాను వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేసి అరికడితేనే మలేరియాను పూర్తిగా నివారించవచ్చని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీసౌజన్య, పి.విజయ్ అన్నారు. శనివారం వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని బొమ్మరాళ్లతిప్పలో మలేరియా మాసోత్సవం పురస్కరించుకుని మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్రామంలో వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ లార్వా అధికంగా ఉండే ప్రదేశాలను తనిఖీ చేసి వాటిలో వృద్ధి చెందిన దోమ లార్వాలు ప్రజలకు చూపించి వాటిని నాశనం చేయడంపై అవగాహన కల్పించారు. నీటి వాడకం తగ్గించాలని, మురుగునీరు లేకుండా చూడాలని, నీరు నిలువ ఉన్న ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, కొట్టిపడేసిన కొబ్బరి బొండాల్లో దోమ లార్వా విపరీతంగా వృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు



భక్తులతో కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతా మూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు**

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

## చిత్తడిగా మారిన అప్రోచ్ రోడ్డులో ఇక్కట్లు




టేకిశెట్టిపాలెం-అప్పనరామునిలంక అప్రోచ్ రోడ్డు దుస్థితి

**సఖినేటిపల్లి:** టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య బాడిరేవు (గోదావరి పాయ)పై ఇటీవల కాలంలో నిర్మించిన పక్కా కల్వర్టుకు అప్పనరామునిలంక వైపు ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ రోడ్డు వర్షాలకు చిత్తడిగా మారింది. అప్రోచ్ రోడ్డు నిమిత్తం వేసిన కంకర గుట్టలతోను, అడపా దడపా కురుస్తున్న వర్షాలకు నిలిచిపోతున్న నీరుతోను ఈ మార్గంలో ప్రయాణికుల రాకపోకలకు అవరోధంగా మారింది. సఖినేటిపల్లి, మలికిపురం మండలాలకు చెందిన వారితో పాటు, వేర్వేరు జిల్లాల నుంచి వాహనాల్లో చించినాడ వంతెన మీదుగా అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రయాణికులు ఇక్కడి బాడిరేవు కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే కల్వర్టుకు టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు కంటే అప్పనరామునిలంక వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు ఎంతో ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రయాణికులతో వెళుతున్న ఒక ఆటో ఇటీవల అప్రోచ్ రోడ్డుకు సమీపంలో గోదావరి పాయలోకి తిరగ బడిన ఘటన చోటు చేసుకుంది. త్రుటిలో ఆటోలోని వారందరికీ పెను ప్రమాదం తప్పింది కూడా. కల్వర్టు అప్రోచ్ రోడ్డుల్లో త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పించాలని స్థానికులు ఆ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### జనతా ఇన్సూరెన్స్ స్కీంలో చెక్కుల పంపిణీ

**సఖినేటిపల్లి:** అంతర్వేది పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు మేడిది జగపతిరావు, పోతురాజు భగవన్నారాయణల కుటుంబ సభ్యులకు జనతా ఇన్సూరెన్స్ స్కీంలో మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. రైతులు ఇరువురూ కూడా ఒక రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా పై స్కీంలో మంజూరైనవి. వీటిని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు దూది త్రినాథ్, సభ్యులు జెల్లా శ్రీనివాస్, నల్లి మరియమ్మ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘ సీఈవో పినపోతు ప్రభాకర్, బెల్లంకొండ ఏసుబాబు, బెల్లంకొండ రామకృష్ణ పాల్గొన్నారు.

### బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా



పేరి కామేశ్వరరావు

**అంబాజీపేట:** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి పేరి కామేశ్వరరావు శనివారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో దానికి నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ పదవికి రాజీమానా చేశానని కామేశ్వరరావు తెలిపారు. తాను వైఎస్సార్ సీపీలో కొనసాగుతానని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. అంబాజీపేట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి దొమ్మేటి సత్యమోహన్ కూడా శనివారం రాజీనామా చేశారు.

## అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

**అంబాజీపేట:** ప్రజాస్వామ్య వ్యవస్థలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఉందని దానిని వక్రీకరించడం మంచి పద్ధతి కాదని.. వాస్తవాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై కె.చిరంజీవి అన్నారు. వాట్సాప్ గ్రూప్‌లో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసినా గ్రూప్ అడ్మిన్‌తో పాటు, మెసేజ్ ఫార్వర్డ్ చేసిన వ్యక్తులపైన శాఖ పరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియా వేదికపై కులాలను, వర్గాలను రెచ్చగొట్టేలా వివాదాస్పద పోస్టింగ్‌లు పెడుతున్నారని వారిపై నిఘా కొనసాగుతోందన్నారు. వివాదాస్పద పోస్టింగ్‌లు ఫార్వర్డ్ చేయడం కూడా నేరమేనన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీసు శాఖ నిరంతరం నిఘాతో అప్రమత్తంగా ఉందని హెచ్చరించారు.

### సర్వీస్ ప్లేస్‌మెంట్ ఉద్యోగుల వివరాల సేకరణ

**యానాం:** సర్వీస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు చేస్తున్నవారి వివరాలను తక్షణం అందజేయాలని ఎల్జీ రాధాకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పరిపాలనా సంస్కరణల శాఖ అధికారులు వివరాల సేకరణకు సంబంధించి పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్లలో అన్ని విభాగాలకు ఉత్తర్వులు పంపించారు. పీడబ్ల్యూడీతో సహా అనేక శాఖల్లో వందలాది మంది ఎంటీఎస్, ఓచర్ పెయిడ్ ఉద్యోగులు అనుమతులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో వివరాల సేకరణ చేపట్టినట్లుగా తెలుస్తుంది.

### బీఎస్సీ నర్సింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**యానాం:** బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం తిరిగి మళ్లీ సెంటాక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని, ప్రభుత్వ కోటా అడ్మిషన్ల ప్రక్రియ సెంటాక్ ద్వారా నిర్వహిస్తారన్నారు. కావున అభ్యర్థులు ఈ నెల 10 నుంచి కొత్తగా తమ దరఖాస్తులను సెంటాక్ వెబ్‌సైట్‌లో పంపాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసినవారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరన్నారు. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ, మదర్ థెరిస్సా నర్సింగ్ సెంటర్ కారైకల్‌లో నీట్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

### గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం

**అమలాపురం రూరల్:** గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు అధ్యక్షతన అమలాపురం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ పాల్గొని సమస్యలపై చర్చించారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మరణించిన పోతురాజు బాబులుకు నివాళులర్పించారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియచేయాలని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, జిల్లా సహాధ్యక్షుడు కె.గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ అల్లాడి, డివిజన్ అధ్యక్షుడు స్వామినాయుడు, మీరా తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా కల్యాణం

**మామిడికుదురు:** ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీ ఫాతిమా జహెరా, హజరత్ అలీ కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి నగరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరం గ్రామంలోని పెద పంజీషాలో కవి సమ్మేళనం జరిగింది. ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా కల్యాణంలోని ముఖ్య ఘట్టాలను కవితల రూపంలో భక్తులకు వివరించారు. తదుపరి మౌలాలీ పంజా నుంచి భార్గాహె ఫాతిమా పంజా వరకు బాణసంచా కాల్పులు, విద్యుత్ దీపాల అలంకరణల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. తదుపరి మిలాద్ జరిగింది. ఎగ్బాల్ హుస్సేన్, జాఫర్ అలీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మత ప్రబోధకుడు షబ్బర్ అలీ జైదీ మిలాద్ ఆలపించారు.

### వంతెన పనుల పరిశీలన

**పి.గన్నవరం:** ఊడిమూడి చింతావారిపేట, ఉచ్చుల వారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులను మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం పరిశీలించారు. జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదిపై రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనుల్లో భాగంగా పంట కాలువపై వంతెన నిర్మాణం పూర్తి కావస్తోంది. రెండేళ్ల క్రితం జగన్‌మోహన్‌రెడ్డి వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో తమకు వంతెన నిర్మించాలని ప్రజలు కోరారు. దీనిపై స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన విషయం విదితమే. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామికి లక్షసిందూర పూజ



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

**అయినవిల్లి:** మండలంలోని నేదునూరు హైస్కూల్ వద్ద వేంచేసిన ఆంజనేయస్వామికి శనివారం లక్ష సిందూర పూజ నిర్వహించారు. వేదపండితుడు పెదపూడి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులు ఈ పూజలు జరిపారు. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, కుంభ పూజ, అగ్నిమథనం, హోమం, తర్పణం వంటి విశేష పూజలతో పాటు లక్షసిందూర, లక్ష తమలపాకులతో పూజలు జరిపారు. స్వామికి ఇష్టమైన అప్పాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.